సీఎం జగన్‌కు ఘన స్వాగతం



సీఎంకు పుష్పగుచ్ఛం అందిస్తున్న మేయర్ నూర్జహాన్, ఏఎంసీ వైస్ చైర్మన్ రామకృష్ణ, మాజీ చైర్మన్ మైబాబు

ఏలూరు (మెట్రో): వైఎస్సార్ ఆసరా పథకంలో మూడో విడత కార్యక్రమానికి దెందులూరు విచ్చేసిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ఏలూరు నియోజకవర్గ నాయకులు ఘన స్వాగతం పలికారు. ఎమ్మెల్యే ఆళ్ల నాని ఆధ్వర్యంలో ఏలూరు మేయర్ షేక్ నూర్జహాన్, ఏఎంసీ చైర్మన్ నెరుసు చిరంజీవి, వైస్ కంచెన రామకృష్ణ హెలిప్యాడ్ వద్ద ముఖ్యమంత్రికి పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికారు. ఏలూరు అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని మేయర్‌కు సీఎం సూచించారు. మార్కెట్ యార్డ్ అభివృద్ధికి మరింతగా కృషి చేయాలని సూచించారు. ముఖ్యమంత్రిని కలిసిన వారిలో ఏఎంసీ మాజీ చైర్మన్ మంచెం మైబాబు, ఎస్ఎంఆర్ పెదబాబు, గుడిదేశి శ్రీనివాస్, నూకపెయ్యి సుధీర్‌బాబు, పార్టీ నగర అధ్యక్షుడు బొద్దాని శ్రీనివాస్, మధ్యాహ్నపు బలరాం, రాష్ట్ర ఎస్ఆర్ఐ నేత దిరిశాల కృష్ణ శ్రీనివాస్ ఉన్నారు.

ముఖ్యమంత్రి సభకు కొల్లేరు ప్రజలు

ఏలూరు రూరల్: దెందులూరులో శనివారం నిర్వహించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సభకు కొల్లేరు గ్రామాల ప్రజలు పోటెత్తారు. సంక్షేమ పథకాల అమలు చేస్తూ బడుగు, బలహీన వర్గాల ప్రజల మన్ననలు పొందిన ముఖ్యమంత్రి సొంత నియోజకవర్గానికి రావడంతో ప్రజలు తరలి వెళ్లారు. ఏలూరు మండలం మొండికోడు గ్రామం నుంచి ఎంపీపీ పెన్మెత్స శ్రీనివాసరాజు ఆధ్వర్యంలో పార్టీ కార్యకర్తలు, నాయకులు, మహిళలు బస్సులో వెళ్లారు. ప్రత్తికోళ్లలంక సర్పంచ్ ఘంటసాల మహాలక్ష్మీరాజు, తేరా ఆనంద్ ఆధ్వర్యంలో గ్రామస్తులు పార్టీ జెండాతో ఏలూరు పాతబస్టాండ్ మీదుగా దెందులూరుకు బైక్ ర్యాలీ నిర్వహించారు. శ్రీపర్రు, చాటపర్రు, మాదేపల్లి, కొక్కిరాయిలంక, గుడివాక లంక, జాలిపూడి నుంచి వైఎస్సార్‌సీపీ శ్రేణులు, వైఎస్ అభిమానులు, రైతులు సభకు చేరుకున్నారు.

కొల్లేరు ప్రజల అభివృద్ధికి వినతి

ఏలూరు రూరల్: కొల్లేరు ప్రజల అభివృద్ధి కోసం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి వినతి పత్రం అందించామని రాజన్న కొల్లేరు సంఘం అధ్యక్షుడు మండల కొండలరావు ఓ ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు శనివారం దెందులూరులో ముఖ్యమంత్రికి వినతిపత్రం అందజేశామన్నారు. దివంగత నేత వైఎస్ రాజశేఖరరెడ్డి ఆశించిన విధంగా కొల్లేరు భూముల సర్వే చేపట్టి మిగులు భూములు కొల్లేరు గ్రామాల పేదలకు పంపిణీ చేయాలని, బీసీ, ఎస్సీ, ఈబీసీ ఫిషరీష్ సొసైటీలకు మహానేత హయంలో అందించిన వెదురు, వలలు, తీగలు పంపిణీని పునరుద్ధరించాలని, వడ్డి కులస్తులను మత్స్యకారులుగా గుర్తించడంతో పాటు కొల్లేరులో చేపల వేట విరామ సమయంలో ఉపకార వేతనం అందించాలని కోరామన్నారు. మూడేళ్ల కాలంలో రూ.కోట్లు వెచ్చించి కొల్లేరు గ్రామాల్లో రోడ్లు, మురుగునీరు డ్రెయినేజీ, తాగునీటి వ్యవస్థ అభివృద్ధి చేసినందుకు కృతజ్ఞతలు తెలిపామన్నారు. కొల్లేరు గ్రామాలకు ప్రధాన రోడ్ల అనుసంధానం, కొల్లేరు డ్రెయిన్ల ప్రక్షాళన చేయాలని కోరామన్నారు.

రజకులకు ఎమ్మెల్సీ పదవి కోరుతూ వినతి

ఏలూరు (టూటౌన్): రజకులకు ఎమ్మెల్సీ పదవిని ఇవ్వాలంటూ సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి వినతి పత్రం అందజేసినట్టు ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా రజక జన సంఘం అధ్యక్షుడు చిలకలపల్లి కట్లయ్య, సంయుక్త కార్యదర్శి జువ్వలపాలెపు సత్యనారాయణ తెలిపారు. ఈ మేరకు వివరాలను స్థానిక సంఘ కార్యాలయంలో వారు వెల్లడించారు. దెందులూరు విచ్చేసిన సందర్భంగా సీఎం జగన్‌ను కలిసినట్టు చెప్పారు. రాష్ట్రంలోని దాదాపు 25 లక్షల మంది రజకుల్లో అత్యధిక శాతం మంది వైఎస్సార్‌సీపీ వెంట ఉన్నారని తెలిపారు. జనాభా దామాషా ప్రకారం రజకులకు ఎమ్మెల్సీ స్థానం కేటాయించాలని, ప్రతి పంచాయతీ పరిధిలో వృత్తి చెరువులను కేటాయించాలని, కనీస ధరకు లీజులు నిర్ణయించాలని, రజకులకు రక్షణ చట్టం తేవాలని వినతి పత్రంలో కోరామన్నారు. మెట్ట ప్రాంతాల్లో చెరువుల వద్ద బోర్లు, మోటార్ల ఏర్పాటు, రజక విశ్రాంతి భవనాలకు నిధులు కేటాయించాలని పేర్కొన్నారు. రజక వృత్తిదారులకు చేదోడు పథకం ద్వారా కుటుంబానికి రూ.10 వేలు సాయం చేయడం పట్ల రజక సంఘం తరపున ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌కు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా రజక సంఘం నాయకులు యలమంచిలి నాగ శేషు, మెట్ట ప్రసన్న, వి.శ్రీనివాస్, అవిడి సుబ్రహ్మణ్యం తదితరులు ఉన్నారు.

సీఎం జగన్‌కు గవ్వల ఫొటో ఫ్రేం అందజేత



సీఎం వైఎస్ జగన్‌కు గవ్వలతో చేసిన ఫొటో ఫ్రేం అందిస్తున్న మైక్రో ఆర్టిస్ట్

ఏలూరు (టూటౌన్): వైఎస్సార్ ఆసరా మూడో విడత ప్రారంభోత్సవానికి దెందులూరు విచ్చేసిన సీఎం వైఎస్ జగన్‌కు గవ్వలతో చేసిన ఫొటో ఫ్రేంలను అందించినట్టు ఏలూరుకు చెందిన మైక్రో ఆర్టిస్ట్ డి.శివప్రసాద్ తెలిపారు. మెప్మా ఆధ్వర్యంలో సభా ప్రాంగణంలో ఏర్పాటు చేసిన స్టాల్స్ సందర్శన సమయంలో తాను సొంతంగా గవ్వలతో తయారు చేసిన రెండు ఫ్రేంలను సీఎం జగన్‌కు అందించడం సంతోషంగా ఉందని శివప్రసాద్ తెలిపారు. తన జీవితంలో మర్చిపోలేని రోజుగా గుర్తుంచుకుంటానని చెప్పారు. తనకు ఇంతటి గొప్ప అవకాశాన్ని కల్పించిన మెప్మా అధికారులకు శివప్రసాద్ కృతజ్ఞతలు తెలిపారు.

క్లుప్తంగా

పేదలకు భూమి పంచిన బాపనయ్య



బాపనయ్య చిత్ర పటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

ఏలూరు (టూటౌన్) : జమిందారీ విధానానికి వ్యతిరేకంగా పోరాడి పేదలకు భూమి పంచిన నేత గుంటూరు బాపనయ్య అని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎ.రవి, రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ అన్నారు. బాపనయ్య 45వ వర్ధంతి సందర్భంగా శనివారం స్థానిక అన్నే భవన్‌లో బాపనయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు పీవీ రామకృష్ణ, పి.కిషోర్, జవీఎల్ నరసింహారావు, వి.సాయిబాబు, బి.జగన్నాథరావు, ఎ.శ్యామలరాణి, టి.సత్యనారాయణ, జె.గోపి తదితరులు పాల్గొన్నారు.

వెంకటరమణ మృతి తీరని లోటు



సంస్మరణ సభలో మాట్లాడుతున్న వీరభద్రాచారి

ఏలూరు (టూటౌన్): కెల్లా వెంకటరమణ మృతి వడ్రం పనివార్ల ఉద్యమానికి, చేతి వృత్తిదారుల ఉద్యమానికి తీరని లోటని వడ్రం పనివార్ల సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు మారేడిపూడి వీరభద్రాచారి, చేతి వృత్తిదారుల సమన్వయ కమిటీ జిల్లా కన్వీనర్ పిచ్చుక ఆదిశేషు, ఏవీఆర్ విజ్ఞాన కేంద్రం కార్యదర్శి గుడిపాటి నరసింహారావు పేర్కొన్నారు. వడ్రం పనివార్ల సంక్షేమ సంఘం ఏలూరు నగర అధ్యక్షుడు వెంకటరమణ సంస్మరణ సభ స్థానిక సత్రంపాడులోని ఆయన నివాసంలో సంఘం నగర కార్యదర్శి కొత్తల శివకుమార్ అధ్యక్షతన శనివారం నిర్వహించారు. సంఘం నాయకులు హరి సత్యనారాయణ, తాటకోటి సూర్యప్రకాష్, మానేపల్లి నాగేశ్వరరావు, కెల్లా దుర్గాప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

ఆదాయ పన్ను శాఖలో ఉద్యోగాలు

ఏలూరు రూరల్: ఉత్తర్‌ప్రదేశ్, ఉత్తరాఖండ్ రాష్ట్ర ఆదాయ పన్ను శాఖ స్పోర్ట్స్ కోటాలో ఉద్యోగాల నియామకం చేపట్టిందని జిల్లా చీఫ్ కోచ్ బి.శ్రీనివాసరావు ఓ ప్రకటనలో తెలిపారు. ఈ నెల 18వ తేదీ నుంచి నెల రోజుల్లోపు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. గేమ్స్, స్పోర్ట్స్‌లో 65 క్రీడాంశాల్లో ఒలింపిక్స్, ప్రపంచ చాంపియన్‌షిప్, ఏషియన్ గేమ్స్, కామన్‌వెల్త్ స్థాయి పోటీల్లో ప్రతిభ చూపిన క్రీడాకారులు అర్హులని పేర్కొన్నారు.

ఎర్త్ అవర్ అవగాహన ర్యాలీ



కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహిస్తున్న ప్రతినిధులు, విద్యార్థులు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): మార్చి నెల చివరి శనివారం నిర్వహించే ఎర్త్ అవర్ కార్యక్రమాన్ని పురస్కరించుకొని ఆంధ్రప్రదేశ్ నేషనల్ గ్రీన్ కోర్ ఆధ్వర్యంలో నగరంలో ఎర్త్ అవర్ అవగాహన ర్యాలీని నిర్వహించారు. శనివారం రాత్రి 8.30 గంటల నుంచి 9.30 వరకు ప్రతి ఒక్కరూ తమ ఇంటిలోని విద్యుత్ ఉపకరణాలను ఒక గంట పాటు ఆపివేసి ఎర్త్ అవర్ పాటించాలని, విద్యుత్ పొదుపుతో భూమిని, పర్యావరణాన్ని పరిరక్షించాలనే నినాదాలతో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నేషనల్ గ్రీన్ కోర్ జిల్లా సమన్వయకర్త స్వర్ణ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ 2007వ సంవత్సరంలో ఆస్ట్రేలియాలోని సిడ్నీలో ఎర్త్ అవర్ కార్యక్రమాన్ని ప్రారంభించారన్నారు. ప్రపంచవ్యాప్తంగా నిర్వహించే వాతావరణ దినోత్సవం గ్లోబల్ వార్మింగ్ కారణంగా జీవరాశి ఉనికి ప్రశ్నార్థంగా మారినందున భూమిని కాపాడుకోవడానికి, పర్యావరణాన్ని పరిరక్షించుకోవడానికి ప్రతి ఒక్కరూ నడుం బిగించాల్సిన అవసరం ఉందని తెలిపారు. స్థానిక అమీనాపేటలోని బాలయోగి సైన్స్ పార్క్ నుంచి హాస్టల్ ప్రాంగణాల వరకు ఏలూరు పట్టణంలోని వివిధ పాఠశాలల ఎకో క్లబ్ విద్యార్థులు, కళాశాల విద్యార్థులు కొవ్వొత్తులు చేతబట్టి నినాదాలతో ర్యాలీని నిర్వహించారు. కార్యక్రమంలో గ్రీన్ టీచర్లు రెడ్డి రామారావు, సోషల్ వెల్ఫేర్ హాస్టల్ కళాశాల వార్డెన్ ఆర్ఎస్ మంగళ, బీసీ హాస్టల్ వార్డెన్ వై.పద్మజ పాల్గొన్నారు.

అటవీ సంరక్షణపై దృష్టి సారించాలి

జంగారెడ్డిగూడెం : అటవీ సంరక్షణ, విస్తరణపై అటవీ శాఖ రేంజ్ అధికారులు దృష్టి సారించాలని జిల్లా అటవీ శాఖ అధికారి రవీంద్ర సూచించారు. శనివారం స్థానిక అటవీ శాఖ సబ్ డీఎఫ్ఓ కార్యాలయంలో పోలవరం, కన్నాపురం, జంగారెడ్డిగూడెం, కుక్కునూరు, అమరవరం ఫారెస్ట్ రేంజ్ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అటవీ సంరక్షణ, విస్తరణ నేపథ్యంలో అధికారులు చేపడుతున్న చర్యల గురించి ప్రస్తావించారు. నర్సరీల నిర్వహణ, ప్లాంటేషన్ అంశాలపై సమీక్షించారు. కార్యక్రమంలో ఆయనతోపాటు సబ్ డీఎఫ్ఓ సౌజన్య, అటవీ శాఖ రేంజ్ అధికారులు పాల్గొన్నారు.

చల్లాలమ్మ ఉత్సవాలు



గరగలను తీసుకువెళుతున్న భక్తులు

ఉంగుటూరు: ఉంగుటూరు గ్రామ దేవత చల్లాలమ్మ ఉత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి. అమ్మవారిని శనివారం కాలవతల పేట, సాలిపేట, ఎర్రచెరువు రోడ్డు, హైస్కూల్ ప్రాంతాల్లో ఊరేగించారు. ఇంటికి వచ్చిన అమ్మవారిని మహిళలు భక్తి శ్రద్ధతో పూజలు చేశారు. సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా శనివారం రాత్రి డాన్స్ బేబీ డాన్స్ నిర్వహించారు. ఉత్సవ కమిటీ చైర్మన్ శ్రీరెడ్డి శ్రీనివాసరావు పర్యవేక్షణలో భక్తులకు ఎటువంటి అసౌకర్యం లేకుండా కమిటీ సభ్యులు ఏర్పాట్లు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో అమ్మవారిని దర్శించుకున్నారు. శుక్రవారం రాత్రి ప్రదర్శించిన మనుషులు మారాలి నాటికలో ప్రధాన పాత్ర, సూత్రధారుడు చల్ల సూర్యారావు అనే కళాకారుడిని ఉత్సవ కమిటీ సభ్యులు ఘనంగా సత్కరించారు.

కనకదుర్గాదేవి తెప్పోత్సవం

భీమడోలు: పూళ్ల పంచాయతీ శివారు సదాపురంలో కనకదుర్గాదేవి ఆలయంలో ఉగాది ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం రాత్రి స్థానిక కోనేరులో తెప్పోత్సవం కనుల వేడుకగా నిర్వహించారు. ఆలయ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఉగాది ఉత్సవాలు వైభవంగా నిర్వహిస్తున్నారు. ప్రత్యేకంగా అలంకరించిన పడవలో అమ్మవారికి ఉంచి తెప్పోత్సవం నిర్వహించారు. పరిసర గ్రామాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి ఈ వేడుకను తిలకించి అబ్బురపడ్డారు. కోనేరు చుట్టూ విద్యుత్ దీపాలు, బాణసంచా కాల్పులతో ఆ ప్రాంతమంతా సందడి నెలకొంది. శనివారం ఉగాది ఉత్సవ ముగింపును పురస్కరించుకుని ఆలయం వద్ద భారీ అన్న సమారాధన ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఉత్సవ కమిటీ నిర్వాహకులు పాల్గొన్నారు.



కోనేరులో కనకదుర్గాదేవికి తెప్పోత్సవం

పశువులకు గాలికుంటు నివారణ టీకాలు తప్పనిసరి

బుట్టాయగూడెం : మూడు నెలల వయస్సు దాటిన పశువులన్నింటికీ తప్పనిసరిగా గాలికుంటు నివారణ టీకాలు వేయించాలని పశువర్థక శాఖ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ జి.నెహ్రూబాబు తెలిపారు. శనివారం సాయంత్రం ఆయన విలేకరులతో మాట్లాడుతూ జిల్లాలో గాలిగుంట నివారణ వ్యాక్సిన్ కార్యక్రమం ప్రారంభమైందన్నారు. ఈ నెల 25 నుంచి ఏప్రిల్ 24 వరకు సుమారు నెల రోజులపాటు ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. జీలుగుమిల్లి, బుట్టాయగూడెం, పోలవరం, కుక్కునూరు, వేలేరుపాడు, తదితర గ్రామాల్లో పశువులకు టీకాలు వేయించాలని అన్నారు. తొలిరోజు మూడు నెలలు దాటిన సుమారు 21,460 పశువులకు టీకాలు వేసినట్లు తెలిపారు. జీలుగుమిల్లి మండలం దర్భగూడెంలో ఈ నెల 28న సంవత్సంలోపు వయస్సు గల ఆవు, గేదె దూడల ప్రదర్శన, దూడల పెంపకంపై అవగాహన కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. ఈ పోటీల్లో పాల్గొన్న వాటిని పరిశీలించి మొదటి, రెండవ, మూడవ బహుమతులను అందజేస్తారని పశువైద్యాధికారిణి జె.లక్ష్మీప్రసన్న తెలిపారు.

పశువులకు టీకాలు

పెదపాడు: రైతులు తమ పాడి పశువులకు తప్పనిసరిగా గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేయించాలని డీఏహెచ్ఓ డాక్టరు జీ నెహ్రూబాబు సూచించారు. మండలంలోని నాయుడుగూడెంలో టీకాలు కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ గాలికుంటు టీకాలు తప్పని సరిగా వేయించాలని సూచించారు. శనివారం నాటి కార్యక్రమంలో 523 గేదెలకు టీకాలు అందించారు. ఈ కార్యక్రమంలో ఏడీ టీ గోవిందరాజు, అతనపు ఏడీ డాక్టరు ఏ సుచరిత, పెదపాడు మండల పశువైద్యాధికారి డాక్టరు సీహెచ్ వాణీ సంధ్య, జేవీఓ ఎం ఫణికుమార్, ఎల్ఎస్ఏ కే శ్రీదేవి, ఎండీ ఇర్ఫాన్ పాల్గొన్నారు.

నానో టెక్నాలజీతో విప్లవాత్మక మార్పులు



నానో టెక్నాలజీపై సెమినార్ నిర్వహిస్తున్న దృశ్యం

ఉంగుటూరు: నారాయణపురం శ్రీ అరవింద శతజయంతి ప్రభుత్వ డిగ్రీ కళాశాల భౌతిక శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో నానో టెక్నాలజీ పరిచయం అనే అంశంపై శనివారం సెమినార్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన ప్రిన్సిపాల్ డాక్టర్ టీ.కే విశ్వేశ్వరరావు మాట్లాడుతూ ఆధునిక అనేక పరిశోధనలకు పునాది నానో శాస్త్రం అని, ఈ శాస్త్ర అధ్యయనం మూలంగా ఉపాధి అవకాశాలు అందిపుచ్చుకోవచ్చని అన్నారు.ముఖ్య వక్త హైదరాబాద్ జే.ఎన్.టీయూ ఆచార్యులు, నానో శాస్త్ర విభాగ అధ్యక్షుడు డైరెక్టర్ ఆఫ్ ఇవాల్యూషన్స్ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ నానో పదార్థంగా గుర్తించే అంశాలు, నానో శాస్త్రంలోని మౌలిక అంశాలు, నూతన పరిశోధనలు, దీని మూలంగా వికసించిన విప్లవాత్మకమైన మార్పులను విద్యార్థులకు వివరించారు. నానో శాస్త్రంలో భాగంగా మనం ధరించే వస్త్రాలలో నూతన ఆవిష్కరణ కారణంగా వస్తున్న మార్పులను వివరిస్తూ ఉతకడం, ఇస్త్రీ అవసరంలేని వస్త్రాలు, కడగడం అవసరంలేని పాత్రలు, మొదలైన మార్పులను వచ్చాయన్నారు. ప్రకృతిలోని సహజసిద్ధమైన చర్యల ఆధారంగా నానోశాస్త్రంలో పరిశోధన జరుగుతున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో మరో వక్త గీతం విశ్వవిద్యాలయ పరిశోధకులు చేబ్రోలు ప్రసాద్, భౌతిక శాస్త్ర అధ్యాపకులు బొగ్గల వెంకటేశులు రెడ్డి, ఐక్యూఏసీ కోఆర్డినేటర్ డాక్టర్ కొండా రవి తదితరులు ప్రసంగించారు. విద్యార్థులు వారి సందేహాలను ప్రధాన వక్తలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

దంత కళాశాలలో ఆరోగ్యశ్రీ సేవలు ప్రారంభం

పెదవేగి : పేద ప్రజలకు ఉన్నత సేవలందించడంలో రోమన్ క్యాథలిక్ సంస్థ అగ్రగామిగా నిలుస్తుందని మోస్ట్ రెవరెండ్ కార్డినల్ ఆర్చ్ బిషప్ పూల అంథోని అన్నారు. పెదవేగి మండలం దుగ్గిరాల్లోని సెయింట్ జోసెఫ్ దంత కళాశాలలో తెలుగు బిడ్డ మోస్ట్ రెవరెండ్ పూల అంథోని కార్డినల్ కళాశాలకు శనివారం విచ్చేశారు. మొట్టమొదటిసారిగా తెలుగు వ్యక్తి, హైదరాబాదులో అగ్ర పీఠాధిపతిగా ఉన్న పూల అంథోనిని రోమన్ క్యాథలిక్ ఫ్రాంచెస్ పోపు కార్డినల్‌గా నియమించారు. ఈయన శనివారం కళాశాలకు విచ్చేసి అనేక అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించారు. దీనిలో భాగంగా కళాశాల ఫౌండర్ చైర్మన్ బిషప్ జాన్ ములగడకి నివాళులర్పించి, పునీత జోసఫ్‌కి ప్రార్థనలు చేశారు. పూల అంథోనిని ఏలూరు పీఠాధిపతులు సెయింట్ జోసెఫ్ కళాశాల చైర్మన్ మోస్ట్ రెవరెండ్ బిషప్ జయరావు పాలిమేర కలిసి డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ సేవలను కళాశాలలో ప్రారంభించారు. అనంతరం రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. బిషప్ జయరావు ఏలూరు పీఠాధిపతిగా పదేళ్లు పూర్తయిన సందర్భంగా ఆయన పేరున డెంటల్ మ్యూజియంని ఆంథోని ప్రారంభించారు. కళాశాల కరస్పాండెంట్, సెక్రటరీ ఫాదర్ మోజెస్ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. అంథోని, జయరావు కలిసి ఫాదర్ మోజెస్‌ను, ఫాదర్ ఫెలిక్స్‌ను సత్కరించారు. ప్రిన్సిపాల్ ఎస్ స్లీవరాజు, ఏలూరు పీఠంలోని వికార్ జనరల్ పి బాల, చాన్సలర్ బాబు జార్జ్, మెంబర్ ఫాదర్ మైకేల్, అడ్మినిస్ట్రేటర్ ఫాదర్ ఫెలిక్స్, కరస్పాండెంట్ ఫాదర్ జాకబ్, గురువులు అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం



సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు

దెందులూరు: దళిత క్రిస్టియన్లను ఎస్సీల్లో చేర్చాలని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అసెంబ్లీలో తీర్మానించడం చరిత్రాత్మక విషయమని వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ జిల్లా కార్యదర్శి, మాలమహానాడు జిల్లా అధ్యక్షుడు గొల్ల కిరణ్ అన్నారు. శనివారం దెందులూరు పెదదళితపేటలో వైఎస్సార్ సీపీ, మాలమహానాడు సంయుక్త ఆధ్వర్యంలో కృతజ్ఞతగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో కొరపాటి రత్నకిషోర్, గుడిపూడి శేఖర్‌బాబు, గుంపుల ప్రసాద్, గలాక్సీ గల్బర్ పాల్గొన్నారు.

ఘనంగా కోదండరామ ఆలయ పునఃప్రతిష్ఠ మహోత్సవం

పెదపాడు : స్థానిక సత్యన్నారాయణ పురంలో కోదండరామ ఆలయ పునఃప్రతిష్ఠ కార్యక్రమాలు శనివారంతో ముగిసాయి. ఉదయం ఆలయం వద్ద కిలారి రఘు దంపతులతో చండీహోమం నిర్వహించారు. స్వామి కల్యాణం వైభవంగా నిర్వహించారు. స్వామివారికి ప్రత్యేకంగా తయారు చేసిన ప్రత్యేక ప్రసాదాలను నైవేద్యంగా సమర్పించారు. దాతల సహకారంతో భారీ అన్నసమారాధన నిర్వహించారు. కార్యక్రమంలో కిలారు సాంబశివరావు, ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

బీజేపీ విధానాలకు నిరసనగా చలో ఢిల్లీ

భీమడోలు: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అనసరిస్తున్న కార్మిక, కర్షక వ్యతిరేక నిర్ణయాలను నిరసిస్తూ ఏప్రిల్ 5న చేపట్టిన చలో ఢిల్లీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఆర్.లింగరాజు అన్నారు. సూరప్పగూడెం పంచాయతీ శివారు పాతూరు సివిల్ సప్‌లెయిూస్ గుడౌన్ వద్ద శనివారం హమాలీ కార్మికులతో కలిసి ఆయన గోడ పత్రికలను ఆవిష్కరించారు. ఈనెల 26 నుంచి నాలుగు రోజుల పాటు జిల్లాలోని 27 మండలాల్లో ప్రచార యాత్ర నిర్వహిస్తామన్నారు. సీఐటీయూ నాయకులు ప్రసాద్, దుర్గారావు, రాంబాబు, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఏకలవ్య పాఠశాలలో ప్రవేశాలకు ఆహ్వానం

బుట్టాయగూడెం : కేఆర్‌పురం ఐటీడీఏ పరిధిలో గల బుట్టాయగూడెం మండలం ఇప్పలపాడు సమీపంలో గల గిరిజన సంక్షేమ ఏకలవ్య గురుకుల పాఠశాలలో 2023–24 విద్యా సంవత్సరంలో 6వ తరగతిలో ప్రవేశానికి, ఖాళీగా ఉన్న 8వ తరగతి బ్యాక్‌లాగ్ ఖాళీల ప్రవేశానికి విద్యార్థుల నుంచి ఆన్‌లైన్ దరఖాస్తులు కోరుతున్నట్లు ఐటీడీఏ ఇన్‌చార్జి డిప్యూటీ డైరెక్టర్ పీవీఎస్ నాయుడు శనివారం ఒక ప్రకటనలో కోరారు. బాలికలు – 30 సీట్లు, బాలురు – 30 చొప్పున మొత్తం 60 సీట్లు కేటాయించడం జరిగిందని అన్నారు. ఆసక్తి గల విద్యార్థులు ఆన్‌లైన్‌లో ఏప్రిల్ 15వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఏప్రిల్ 30వ తేదీన ఏకలవ్య గురుకుల పాఠశాల ఇప్పలపాడులో ప్రవేశ పరీక్ష జరుగుతుందని అన్నారు. విద్యార్థినీ విద్యార్థులకు వచ్చిన మార్కుల ఆధారంగా సీట్లు కేటాయించడం జరుగుతుందని తెలిపారు.

సూర్యం మాస్టారుకు ఎంపీ శ్రీధర్ పరామర్శ

పెదపాడు: రాష్ట్ర హస్తకళల కార్పొరేషన్ డైరక్టరు, కొత్తూరు మాజీ సర్పంచ్ ముదుగురు సూర్యనారాయణను ఏలూరు ఎంపీ కోటగిరి శ్రీధర్ శనివారం పరామర్శించారు. పెదపాడు మండలంలోని కొత్తూరుకి చెందిన సూర్యనారాయణ తండ్రి రాములు శుక్రవారం సాయంత్రం మరణించారు. కొంతక్రితం రాములు అనారోగ్యానికి గురై శుక్రవారం సాయంత్రం మరణించడంతో ఎంపీ శ్రీధర్‌తోపాటు పెదపాడు జెడ్పీటీసీ ఘంటా పద్మశ్రీ ప్రసాదరావు, జిల్లా రైతు విభాగం మాజీ అధ్యక్షుడు ఆళ్ల సతీష్‌చౌదరి, నర్సాపురం నియోజకవర్గ పరిశీలకుడు ఘంటా ప్రసాదరావు, మండల కన్వీనర్ అప్పన ప్రసాద్, బత్తుల రత్నకుమారి ఏసురాజు, సంబంగి శ్రావణ్‌కుమార్, సాధం కిశోర్, గుణుపూరు మహేష్, కోట గోవర్ధన్ తదితరులు పరామర్శించారు.

ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

ఏసీ బస్సులు..

బస్సు రూటు	సమయం	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు –బీహెచ్‌ఈఎల్ వయా విజయవాడ (ఇంద్ర)	21.00	08
ఏలూరు –బీహెచ్‌ఈఎల్ వయా ఖమ్మం (ఇంద్ర)	21.00	25
ఏలూరు – బీహెచ్‌ఈఎల్ (అమరావతి)	22.00	30
ఏలూరు – తిరుపతి(ఇంద్ర)	19.00	34

సూపర్ లగ్జరీ

బస్సు రూటు	సమయం	సర్వీస్ నంబర్	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు –బీహెచ్‌ఈఎల్	21.45	4820	06
ఏలూరు –బీహెచ్‌ఈఎల్ వయా కే.కోట	19.30	4796	05
ఏలూరు –బీహెచ్‌ఈఎల్ వయా రామచంద్రపురం	19.45	4798	06
ఏలూరు –జీడిమెట్ల వయా ఖమ్మం	20.15	4802	25
ఏలూరు –ఈసీఐఎల్	22.30	4814	11
ఏలూరు – బీహెచ్‌ఈఎల్	22.15	34820	06
ఏలూరు –బీహెచ్‌ఈఎల్	09.00	4794	29
ఏలూరు – విశాఖపట్నం	12.00	4840	34
ఏలూరు –విశాఖపట్నం	22.00	4838	33
ఏలూరు – తిరుపతి	16.00	4830	18

కూరగాయల ధరలు

ఏలూరు నగరంలోని రైతు బజార్లలో కూరగాయల ధరలు

కూరగాయలు	కిలో ధర	కూరగాయలు	కిలో ధర
టమాటాలు	20	అరటి కాయ (1)	05–07
వంకాయలు (గులాబీ)	20	చిక్కుడు కాయలు	68
వంకాయలు (కాంతులు)	22	చామదుంపలు	64
వంకాయలు (తెలుపు)	26	ములక్కాడలు	08–10
బెండకాయలు	40	కంద	46
పచ్చిమిర్చి	28	బీట్‌రూట్	34
కాకర కాయలు	30–34	కీరా దోస	30
బీరకాయలు	40	ఫ్రెంచ్‌బీన్స్	90
బీరకాయలు (పందిరి)	48	అల్లం	100
క్యాబేజీ	18	కొత్తిమీర (కట్ట)	18
క్యారెట్	38	పాలకూర	10
దొండకాయలు	34	చుక్కకూర	10
బంగాళదుంపలు	20	తోటకూర	10
ఉల్లిపాయలు	20	గోంగూర	08
గోరుచిక్కుడు	44	పుదీనా	05
దోసకాయలు	28–38	బఠాణి	60
అనబకాయ (1)	10–15	క్యాప్సికమ్	66
పొట్లకాయ(1)	15	చిలకడదుంప	24